క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూరు: మండలంలోని తిమ్మాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కొత్తూరు పట్టణం, నాట్కో, పెంజర్ల ఫీడర్లలో ఉన్న గ్రామాలకు ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పలు మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించే పనులు చేపడుతున్నట్లు వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

ఎంపీ కృషితోనే నవోదయ పాఠశాల

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు రెండో నవోదయ పాఠశాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ఎంపీ డీకే అరుణ కృషితోనే ఈ పాఠశాల మంజూరైనట్టు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాల ఏర్పాటుతో 5 నుంచి 12వ తరగతి వరకు 600 మంది విద్యార్థులకు ఉన్నతమైన విద్య అందుతుందన్నారు. నవోదయ పాఠశాలలు చాలా మందిని ఐఏఎస్, ఐపీఎస్‌లను తయారు చేసిందన్నారు. జిల్లాకు రెండో నవోదయ పాఠశాలను తీసుకొచ్చిన ఎంపీకి జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, కృష్ణయ్య, కృష్ణయాదవ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

యువ నేతల సేవలు ఎంతో అవసరం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



యువజన నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి యువజన కాంగ్రెస్ సేవలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన పలువురు నాయకులను శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో యువజన కాంగ్రెస్ విభాగం ఎంతో పటిష్టమైనదన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని తెలిపారు. పార్టీ ఇచ్చిన ఏ కార్యక్రమాలనైనా ముందుకు తీసుకెళ్లేది యువజన కాంగ్రెస్ నాయకులేనన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన యువజన నాయకులకు తప్పకుండా భవిష్యత్ ఉంటుందని, అభిప్రాయ భేదాలను పక్కన పెట్టి పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, మహ్మద్ అలీఖాన్‌బాబర్, శివశంకర్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, సయ్యద్‌ఖాదీర్, ముబారక్ అలీఖాన్, యువజన నాయకులు అందె మోహన్, రాజేశ్, ఆమెర్, ప్రేమ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అస్థిత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్ర

రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర అస్థిత్వాన్ని దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి రూపాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూపొందించిందని పీసీసీ చైర్మన్ మహేశ్‌కుమార్‌గౌడ్ అర్థం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని దాదాపు 70ఏళ్ల క్రితం మేధావులు, కవులు, కళాకారులు చర్చించి రూపొందించిన విగ్రహమన్నారు. సమాజం రూపొందించుకున్న విగ్రహాన్ని మార్పు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారన్నారు. తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ పాలకులు చేస్తున్న కోతి చేష్టలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, మార్పు కోసం కాంగ్రెస్‌కు అధికారమిచ్చిన ప్రజల జీవితాలలో మార్పులు రాలేదని, విగ్రహాలు, ప్రభుత్వ ముద్రలు, వాహనాల నంబర్ ప్లేట్లలో మార్పును తెచ్చారని ఆరోపించారు. ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అంతా శూన్యమన్నారు. ఈ నెల 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పాత తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు శీలం శ్రీకాంత్, రాజశేఖర్, గుండు అశోక్, నార్ల శ్రీనివాస్, వివరాజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన



కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు దాతల సహకారంతో చేపడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. భవన నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా క్వాలిటీ కలిగిన సామగ్రిని ఉపయోగించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను చేపట్టాలని, ఏమైనా సందేహాలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కళాశాల నిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, నాయకులు రఘునాయక్, పురుషోత్తంరెడ్డి, రాజేశ్, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

విద్యార్థులలో ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని, ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వర్‌రావు విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో వ్యక్తిత్వ వికాసంపై తల్లితండ్రులు, పిల్లలకు మధ్య అనుబంధం ఏ విధంగా ఉండాలి, చిల్డ్రన్స్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, విద్యార్థుల చదువు, నైపుణ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, లక్ష్య సాధనకు ప్రణాళికలను రూపొందించుకొని నిరంతరం ఆ దిశగా శ్రమిస్తే విజయ తీరాలకు చేరుకుంటారన్నారు. విద్యపైనే దృష్టి సారించాలని, వ్యసనాల జోలికి వెళ్లరాదని సూచించారు. తల్లితండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చేందుకు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకొని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణం అభినందనీయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, గ్రంథాలయ చైర్మన్, కుటుంబ సభ్యులు

షాబాద్: తన తండ్రి జ్ఞాపకార్థం మల్లీ మహేశ్, మధుకుమార్‌లు బస్‌షెల్టర్ నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో దైవాలగూడ చౌరస్తాలో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లీ మహేశ్, మల్లీ మధుకుమార్ తన తండ్రి మల్లీ జంగయ్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సొంత ఖర్చులతో బస్‌షెల్టర్ నిర్మించారు. శనివారం ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో తల్లిదండ్రులను సరిగా చూసుకోని తరుణంలో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బస్‌షెల్టర్ నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత మల్లీ వెంకటేశ్, నాయకులు రాహుల్‌గుప్తా, అన్వర్, చేవెళ్ల స్వామి, గ్రామస్తులు ఎండీ హైమద్, భాస్కర్, మల్లీ మల్లేశ్, బంగారు ఎల్లేశ్, సుందర్, లింగాల రమేశ్, పార్వతి విజయ్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

కేశంపేట: సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల విద్యాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రాలు అందించారు. విద్యాశాఖలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న తమను పర్మినెంట్ చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. సమగ్ర శిక్షలో రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాత పరీక్ష ద్వారా ఎంపికై నట్టు తెలిపారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేసేవరకు మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా తమ హక్కుల సాధనకు సమ్మెకు వెళ్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో సీఆర్పీలు మల్లేశ్, మల్లయ్య, రామకృష్ణ, కేజీబీవీ ఉపాధ్యాయులు వరలక్ష్మి, నక్షత్ర, జ్యోతి, సువర్ణ, కవితలు తదితరులు పాల్గొన్నారు.

‘సీఎం కప్’ను విజయవంతం చేయండి

ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజు



శంకర్‌పల్లి: సమావేశంలో పాల్గొన్న ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్‌ను విజయవంతం చేయాలని శంకర్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజు అన్నారు. శనివారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ అక్బర్‌తో కలిసి మండలంలోని ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ నెల 8, 9 తేదీల్లో గ్రామాల్లో క్రీడాపోటీలు నిర్వహించి విజేతలను మండలస్థాయి పోటీలకు ఎంపిక చేయాలని సూచించారు. అనంతరం 10, 11, 12 తేదీల్లో మండలస్థాయి పోటీలు నిర్వహించాలని. పోటీలకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని, ఎక్కడ ఇబ్బందులు రావొద్దన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, ఏపీఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండల స్థాయి సీఎం కప్ పోటీలు ఈ నెల 10 నుంచి 12తేదీ వరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో భాగంగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, యోగా క్రీడలను నిర్వహించనున్నట్లు వివరించారు. కాగా ఇప్పటికే మండల స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్న మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన క్రీడాకారులు తమ తమ జట్లతో సమయానికి రావాల్సిందిగా కోరారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మండల విద్యాధికారి శ్రీనివాస్

నందిగామ: భవిత కేంద్రాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రమైన నందిగామలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడారు. భవిత కేంద్రాల కోసం మండలానికి ఇద్దరు చొప్పున స్పెషల్ టీచర్లు ఉన్నారని, వారి సేవలు మండలంలోని ప్రత్యేక అవసరాల పిల్లలు ఉపయోగించుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రత్నయ్య, స్పెషల్ టీచర్లు యమున, కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మొయినాబాద్: సీఎం సహాయ నిధి పేదలకు వరమని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు, సురంగల్, చందానగర్, తోలుకట్ట, కేతిరెడ్డిపల్లి, హిమాయత్‌నగర్, శ్రీరాంనగర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శనివారం మొయినాబాద్‌లో సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా వచ్చిన డబ్బులను వైద్యానికి వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరి సతీశ్, మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ సర్పంచ్‌లు పురాణం వీరభద్రస్వామి, సత్యనారాయణ, సంగెరి మల్లేశ్, మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

- ఈనెల 12 వరకు తప్పులు, సవరణలకు అవకాశం
- 17వ తేదీన తుది జాబితా విడుదల
- ఎంపీడీఓ హిమబిందు



నూతన ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ హిమబిందు, అధికారులు

చేవెళ్ల: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గ్రామాల వారీగా ఉన్న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశామని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఓటరు జాబితా నోటిఫికేషన్ పత్రాలను ఎంపీడీఓ కార్యాలయం వద్ద విడుదల చేసి అన్ని పంచాయతీల వద్ద ప్రదర్శనకు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పంచాయతీల వద్ద ఈ ఓటరు జాబితాలో ఇటీవల మార్పులు, చేర్పులు, కొత్తవారి నమోదు తదితర వాటితో వచ్చిన జాబితాను నోటీస్‌బోర్డులో పెట్టినట్లు చెప్పారు. ప్రజలు ఓటరు జాబితాను చూసుకొని తమ పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు, సవరణలు ఉంటే ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకొని సవరించుకోవచ్చని, 17వ తేదీన ఓటరు తుది జాబితా విడుదలవుతుందన్నారు. చేవెళ్ల మండలానికి సంబంధించి 330 వార్డులు ఉన్నాయని, వీటికి గాను 337 పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీల్లో డ్రాఫ్ట్ ఓటరు జాబితా ఉంటుందని ప్రజలు చూసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీకి సంబంధించిన సర్వే పనులు కూడా ప్రారంభించినట్లు, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న ప్రజల వివరాలతో గ్రామ కార్యదర్శులు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ రవీందర్, జూనియర్ అసిస్టెంట్ సాయి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పోటీలు



గీత కంఠస్థ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

కేశంపేట: గీత జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీశ్రీ కిషన్ ప్రభు గీతా ప్రచార సమితి అధ్వర్యంలో ఉమ్మెంతల మహేశ్వర్ అధ్యక్షతన శనివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రాథమిక స్థాయి విభాగంలో భగవద్గీత 12వ అధ్యాయంలోని భక్తి యోగంలోని పది శ్లోకాలు, ఉన్నత స్థాయి విభాగంలో 12వ అధ్యాయంలోని పూర్తి శ్లోకాలను కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 44 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ప్రాథమిక స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అసియా బేగం, తేజశ్రీ, నిక్షిత (ఆదర్శ విద్యాలయం), ప్రోత్సాహక బహుమతిని లిఖిత (ఆర్‌వీ స్కూల్) విద్యార్థులు నిలిచారు. అదేవిధంగా ఉన్నత విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వర్షిణి, శ్రీవర్ష (ఆదర్శ విద్యాలయం), తృతీయ స్థానంలో ప్రీతి (గ్లోబల్ స్కూల్) గెలుపొందారు. అనంతరం వీరందరికీ నిర్వాహకులు బహుమతులు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, అమృతమ్మ, దేవాలయ కమిటీ చైర్మన్ మఠం శేఖరయ్య, తలసాని సుదర్శన్‌రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, రవీందర్, గీతా ప్రచార సమితి సభ్యులు రంగనాథ్, వెంకటేశ్, చంద్రశేఖర్, కృష్ణయ్య, అయ్యప్పరెడ్డి, హరికిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జూలపల్లి అనసూయమ్మ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘ భవనంలో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామ కమిటీ నిర్మాణంలో భాగంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గుడ్డోళ్ల కృష్ణయ్య, అధ్యక్షుడిగా నింగోళ్ల జంగయ్య, ఉపాధ్యక్షుడిగా గుడ్డోళ్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎంకనోళ్ల శివయ్య, కార్యదర్శిగా మేడిపల్లి యాదయ్య, సహాయ కార్యదర్శిగా అంతిగారి రమేశ్, ముఖ్య సలహాదారులుగా అచ్చగారి యాదయ్య, కొడవటి రామస్వామి, ముత్యాల రామయ్య, సభ్యులుగా వెంకటేశ్, శ్యాంకుమార్, యాదయ్య, విజయ్‌కుమార్, నరేశ్, చిన్న యాదయ్య, యాదయ్య, కృష్ణయ్య, లింగం, శ్రీనివాస్, నర్సింహ, శ్రీనివాస్, పెద్ద యాదయ్య, రాకేశ్, ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులకు పెంటనోళ్ల నర్సింహ నియామకపత్రం అందజేశారు.

ఎన్‌సీడీకి ఫైవ్ రేటింగ్ సర్టిఫికెట్



ఎన్‌సీడీ అధినేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

శంకర్‌పల్లి: మండలంలోని మోకిలలో పలు గృహ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టిన నిఖిల కన్‌స్ట్రక్షన్ డెవలపర్స్(ఎన్‌సీడీ)కి అత్యున్నత ప్రమాణాలు, నాణ్యత విషయంలో ఫైవ్ స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ లభించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్‌సీడీ అధినేత, ఎండీ శ్రీనివాసరావుకు సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగాఎన్‌సీడీ ఎండీ మాట్లాడుతూ.. హెచ్‌వైఎం అనే అంతర్జాతీయ సంస్థ ద్వారా తమకు ఫైవ్ స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ రావడం ఎంతో సంతోషాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తోందన్నారు. తమ సంస్థ చేపట్టిన ప్రతి ప్రాజెక్టు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోందని, దాన్ని గుర్తించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తోంది ప్రజాపాలన కాదని, ప్రజా వ్యతిరేకపాలన అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య విమర్శించారు. శనివారం హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభకు పట్టణం నుంచి నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు నెరవేర్చడంలో వైఫల్యం చెందిందన్నారు. అమలు చేయలేని మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకపాలన చేస్తోందని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500, రైతుకు రూ.15వేల పెట్టుబడి సహాయం వంటి అనేక హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయన్నారు. కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై బీజేపీ సమరశంఖం పూరించిందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అమలుకాని హామీలను ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. ప్రజలు స్థానిక ఎన్నికల్లో బీజేపీని ఆదరించి బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంకనోళ్ల వెంకటేశ్, హరిభూషణ్, బాల్‌రెడ్డి, సురేష్, రంగన్న, కుడుముల బాల్‌రాజ్, మోహన్‌సింగ్, రవినాయక్, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

షాబాద్: రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సీనియర్ నాయకుడు పీసరి సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సరూర్‌నగర్‌లో బీజేపీ నిర్వహిస్తున్న బహిరంగ సభకు మండలం నుంచి నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, నాయకులు రాజీవ్‌రెడ్డి, కృష్ణ, విఠలయ్య, రవి, మహేందర్, అశోక్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంగా మణికంఠ, డీఈఓగా సిద్దార్థ, కలెక్టర్‌గా ఫారియా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, పవన్‌కుమార్, శివాజీ, ఆఫ్రిన్ బేగమ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యేకు మున్సిపల్ కార్మికుల వినతి

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్టు కార్మికులు శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని, నిత్యం పెరుగుతున్న ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆరోపించారు. కార్మికులకు సరైన వేతనాలను పెంచడంతో పాటుగా పని నిర్వహణ సమయాలకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాంట్రాక్టు ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

షాబాద్: మండల పరిధిలోని లక్ష్మారావుగూడ, బొబ్బిలిగామ గ్రామాల్లో శనివారం అయ్యప్ప నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతవరణం సంతరించుకుంది. ఆయా గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు ఆంజనేయులు, గొలుసుల వెంకటేశం, నాగేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు మహాపడిపూజలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పాల్గొని స్వామివారి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.